# కాలం మారినా ప్రేమ ఆగదు!

అచ్చి రఘురామరెడ్డి



ప్రళయ చాలా అందమైనది.

**టైట్ బెల్‌బాటం ప్యాంటు, టైట్ షర్ట్ వేసుకొని స్టయిల్‌గా ఉంటుంది.**

వంకీలు తిరిగిన బాబ్డ్ హేర్ ఎంతో మనోహరంగా ఉంటుంది. ముఖాన బొట్టూ కాటుక లాంటివి కనుపించక పోయినా- విశాల నేత్రాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. అఫ్‌కోర్స్, పువ్వులు పెట్టుకోవడం అసలు లేదనుకోండి- అది ఎప్పుడో ఔటాఫ్ ఫ్యాషన్ అయిపోయింది! ముఖానికి సినిమా వాళ్ళలాగ మేకప్ చేసుకొని ఉంది. పెదాలకు ఎర్రని లిప్‌స్టిక్ పెట్టుకుంది. ఆమె అందం చూసి నోరు తెరిచే వారికి, ఆమె పూసుకొన్న విదేశీ సెంట్ గుబాళిస్తూ మత్తెక్కిస్తుంది.

ఇక, ఆమె అవయవ సోయగాలు ఇట్టే పదేళ్ళ కుర్రాడు వర్ణించి పారేస్తాడు!- కొట్టొచ్చినట్టున్న సువక్ష సంపద. టైట్ ప్యాంటులోని ముందు వెనుక అందాలు - అన్నీ ఎంతో స్పష్టంగా కనుపిస్తూ యువకుల్ని పిచ్చివాళ్ళను చేసేస్తున్నాయి.

ఆమె ఇంటి ఎదురుగా ఒక పెళ్ళికాని యువకుడు ఉన్నాడు. పేరు శ్రీసింహ! రివటలా ఉన్నా ఆడవాళ్ళను ఆకర్షించే మోమూ, మగతనమూ ఉన్నవాడు.

ప్రళయ అంటె శ్రీసింహకు అమితమైన ప్రేమ. చిన్నతనం నుంచీ ఆమెను చూడకుండా ఒక్క నిమిషం కూడ ఉండలేడు. అతనిది ఘాటైన ప్రేమ!

ప్రళయకు కూడ అతనంటే యిష్టమే. ప్రేమ ఇద్దరి మధ్యా టూ వే ట్రాఫిక్‌లా నడుస్తోంది.

వచ్చిన చిక్కంతా 'కన్యాశుల్కం' వద్దే!

ప్రళయ తండ్రి భీషణరావ్ ధనాశాపరుడు. ప్రళయకు భారీ కన్యాశుల్కం వసూలు చేయాలని చూస్తున్నాడు.

పాపం శ్రీసింహ, తల్లిదండ్రులకు నాల్గవ కుమారుడు. ముగ్గురు కొడుకులకు పెళ్ళిళ్ళు చేసి అసలే ఇల్లు గుల్లయిపోయివున్నారేమో, శ్రీసింహకు పెళ్ళి ఎలా చేయడమా అని వాళ్ళు బెంగ పెట్టుకు ఉన్నారు.

ఆ రోజు శ్రీసింహకు అన్నం పెట్టి తల్లి శాంతమ్మ దగ్గర కూర్చుంది.

"నాయనా, సింహా! ప్రళయ తండ్రి ఐదు లక్షల కన్యాశుల్కం కావాలని అడుగుతున్నాడ్రా! నీకు తెలియందేముంది. చెప్పు! అన్నయ్యలు ముగ్గురికి పెళ్ళిళ్ళు చేసి పూర్తిగా అప్పుల్లో మునిగి పోయాం..." అని చెప్పుకుపోతోంది. శ్రీసింహకు ఆ మాటలు కర్ణకఠోరంగా ఉన్నాయి.

శ్రీసింహ ప్రళయను ప్రేమిస్తున్నాడని శాంతమ్మకు తెలుసు.

శాంతమ్మకి కూడ ప్రళయ బాగా నచ్చింది. కాని, వాళ్ళ అంతస్థుకి తాము తూగలేమని ఆవేదన చెందుతోంది. కొద్దిగా కన్యాశుల్కం అడిగే సంబంధం ఏదైన చూసి మెల్లిగా ముడి పెట్టేద్దామని శ్రీసింహ తండ్రి ఆలోచన. తల్లికి మాత్రం శ్రీసింహ అంటే ప్రత్యేకమైన ప్రేమ. అందువల్ల కొడుకుకి నచ్చ చెప్పాలని విఫల ప్రయత్నం చేస్తోంది.

"అమ్మా, నేను పెళ్ళంటూ చేసికొంటే ప్రళయనే చేసుకొంటా! లేదా ఈ జన్మకి పెళ్ళి చేసుకోను!"

"బాబూ! నాకు మాత్రం ప్రళయతో నీ పెళ్ళి చేయాలని లేదా, చెప్పు! కాని అంత డబ్బు ఎక్కడి నుండి తేగలం?మాయదారి రోజులు వచ్చి, మన బ్రతుకులు ఇలా అయిపోయాయి. మా నాన్నగారి రోజుల్లో మగ పెళ్ళివారికే 'వరకట్నాలు' వచ్చేవి! దర్జాగా పెళ్ళిళ్ళు జరిగేవి. ఏ ముదనష్టపోడు ఈ కన్యాశుల్కం మొదలెట్టాడో గాని- మగ పెళ్ళి వారి నోట్లో మట్టి కొట్టాడు. నాగరికత పెరుగుతున్నా, కన్యాశుల్క నిరోధక చట్టం ఖచ్చితంగా అమలు జరపకపోవడం అన్యాయం. మగపిల్లలకి పెళ్ళిళ్ళు చేయలేక ఎంతమంది ఆత్మాహుతి చేసికొంటున్నారు హే! భగవాన్! ఈ కన్యాశుల్క బాధితుల్ని రక్షించు!" అని భగవంతునికి రెండు చేతులు ఎత్తి దండం పెట్టింది.

తల్లి ఆవేదన విన్న శ్రీసింహ మౌనం వహించాడు. కంచంలో చేయి కడుక్కొని భోజనం దగ్గర నుంచి లేచిపోయాడు.

* * * * *

అది ఇరవై ఒకటవ శతాబ్దం-మొదటి దశాబ్దం దాటి రెండవ దశాబ్దం ఆరంభమయిన రోజులు. భారతదేశంలో ఈ ఇరవై ఏళ్ళలో చాలా మార్పులు వచ్చాయి.

అయితే సూర్యుడు తూర్పునే ఉదయిస్తున్నాడు. చంద్రుడు వెన్నెల కురిపిస్తూనే వున్నాడు. గాలి వీస్తూనే వుంది. వర్షాలు పడుతూనే ఉన్నాయి. ప్రకృతి అంతా అలానే వుంది. మనిషి మాత్రం బాగా మారిపోయాడు.

ఇప్పుడు రోడ్డమ్మట వాహనాలు అట్టే వెళ్ళడం లేదు. అన్నీ భూమికి అంత ఎత్తులో, సౌరశక్తితో ఇటూ అటూ తిరుగుతున్నాయి. రోడ్లన్నీ పెద్ద పెద్ద గ[illegible]తో నిండిపోయి వున్నాయి. వాటి కోసం పూర్వంలాగే ఇప్పుడూ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రోడ్ల ప్రక్కల నియాన్ లైట్లు రాత్రివేళ సౌరశక్తితోనే వెలుగుతున్నాయి. అటు ఫ్యాక్టరీలు, ఫరమ్‌లు, ఇటు షాపులు, ఇళ్ళ దీపాలు- అన్నీ సౌరశక్తితోనే!


నిత్యావసర వస్తువులన్నిటికీ పెద్ద పెద్ద 'క్యూ'లలో నిలబడవలసి వస్తోంది. 'రెండు రూపాయల బియ్యం పథకం' ఇప్పుడు ఎత్తివేశారు. అవి కేవలం తిండి లేనివారికే ఇస్తున్నారు. ఇరవై రూపాయల చొప్పున, దేశంలో ఆకలిచావులు లేనందున తిండి లేనివారు లేరని నిర్ధారణ చేసుకొని, ప్రభుత్వం ఇప్పుడు ఎవరికీ ఇవ్వడంలేదు! దేశంలో కల్తీ అంటే ఎవరూ 'వర్రీ' కావడంలేదు. రాళ్ళను అలా వుంచి, సింపిల్‌గా బియ్యం ఏరేస్తున్నారు. ఏటా వచ్చే వరదల నివారణకు ఇంకా గట్టి చర్యలు తీసికోవడానికి అధికారపార్టీ వాళ్ళు విశ్వప్రయత్నం చేస్తూనే వున్నారు.

ఫామిలీ ప్లానింగ్ చేసికొన్నట్లు ఆడామగా ఇద్దరూ సర్టిఫికెట్ తెచ్చుకున్న తర్వాతే ప్రభుత్వం వివాహాలకు అనుమతి యిస్తోంది.

ప్రతి ఆఫీసులో కంప్యూటర్లే అన్ని పనులు చేస్తున్నాయి. ఉద్యోగం అంటే కేవలం ఆకాశదీపం. ఉద్యోగాలు లేనివాళ్ళు ఆటోలు నడుపుకోవడం వలన- క్రమంగా వాటి సంఖ్య లక్షల నుండి కోట్లకు పెరిగిపోయి. బేరాలు లేక ప్రస్తుతం చాలామంది ఈగలు తోలుకుంటున్నారు.

తిండి అంటే- చాలామంది ఫుడ్ టాబ్లెట్లు కొనుక్కొని స్టయిల్‌గా తిని కాలం గడిపేస్తున్నారు.

సినిమాల్లో ప్రేమ చాలా భయంకరంగా చూపిస్తున్నారు. అలనాటి బ్లూ ఫిల్మ్‌లోని తంతు ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్‌లో చోటు చేసుకొంది. రెండర్థాల



## కాలం మారినా ప్రేమ ఆగదు

పాటలు కావు. డైరెక్ట్ అయిపోయాయి. సినిమాల్లో అంతా పాత హీరోల పిల్లలే- ప్రస్తుతం ఆడపిల్లలు కూడ ఫీల్డులో దిగిపోయారు. విచిత్రం! సినిమాలు చూసే ఆడా మగా ప్రేక్షకులు ఏం తగ్గలేదు!

నేరో కట్- బెల్‌బాటం- నేరో కట్-ఇలా పది పదేళ్ళకు మార్పు వస్తూ వస్తూ- ప్రస్తుతం బెల్‌బాటం ఓల్డ్ వచ్చేసింది. చీర కట్టడం బొత్తిగా ఔటాఫ్ అయిపోయింది. టైలర్ ఒక జతకి ఇప్పుడు వెయ్యి తీసుకుంటున్నాడు. ఇలా చాలా మార్పులు వచ్చాయి.

డాక్టర్ ఫీజు మినిమం ఐదు వందలయింది. ప్రభుత్వ ఆసుపత్రుల బెడ్ల మీద కుక్కలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. మేక్సిమమ్ ప్రతి ఒక డాక్టరూ ఒక సొంత నర్సింగ్‌హోమ్ పెట్టాడు!

దేశంలో మానభంగాలూ-హత్యలూ- దోపిడీలూ కామన్ అయిపోయాయి. ఎవరు దొంగో, ఎవరు పోలీసో- ఎవరూ చెప్పలేకుండా వున్నారు. గాంధీమహాత్ముడు అంటే- రామాయణం జరిగిందా? కథా?-అన్నంత ఆశ్చర్యంగా వుంది.

దేశంలో తిండి కొరత ఎలా వున్నా- అడుక్కుతినడం బేన్ చేశారు! ఉద్యోగాల బేన్ అలా నడుస్తూనే వుంది! రిజర్వేషన్లు ఇంకా కొనసాగుతూనే వున్నాయి!

ఆశ్చర్యకరమైన విషయం!ప్రజలు ఎవరూ టీవీలు కొనడం మానివేశారు- ఎందుకో మీకు చెప్పనవసరం లేదనుకుంటాను!-

ఇక రాజకీయ నాయకులు-అధికారపార్టీ వాళ్ళంతా సన్యాసుల్లా కాషాయి వస్త్రాలే ధరిస్తున్నారు! వాళ్ల వద్ద ఏడు తరాలను తగలబెట్టడానికి సరిపడ నోట్ల కట్టలు ఫారిన్ బ్యాంకుల్లో మూలుగుతున్నాయి. అయినా ఇంకా సంపాదిస్తూనే ఉన్నారు-ప్రజాసేవలో.

ఇప్పుడు నిరుద్యోగ నిర్మూలనకు ఒక కేబినెట్ హోదా పెరిగింది!-అలాగే పేదరిక నిర్మూలనకు మరొకటి!- రోజుకొక్క పార్టీ మొలుస్తూనే వుంది- ప్రస్తుతం ఐదు వందల చిల్లర పార్టీలు ఉన్నాయి. నాయకులు ఏ పార్టీ అధికారానికి వస్తే ఆ పార్టీలోనికి సెకెండ్లలో జంప్ చేస్తున్నారు.

పార్లమెంట్‌లో ప్రజానాయకులు అపరకీచకుల లాగున ఒకరి బట్టలు ఒకరు ఊడదీసు కుంటున్నారు! మహిళా నాయకురాళ్ళు సంపూర్ణ కవచాలు ధరించి మరీ వెళ్తున్నారు!బహిరంగంగా అలగాజనం కంటే నీచాతి నీచంగా ది బండెస్ట్ బూతులు తిట్టుకొంటూ, చెప్పులతో కొట్టు కొంటున్నారు. ఓహ్! ఏం చెప్పమంటారు?- ఒకరిపై నొకరుగాండ్రించి ఉమ్మి కూడ వేసుకుంటున్నారు!

ఓటు హక్కు ఇప్పుడు పదేళ్ళకే ఇచ్చారు!!

న్యూస్‌ప్రింట్ కొరత కావాలనే అధికార పార్టీ ఉధృతం చేస్తోంది. దినపత్రిక ఖరీదు పది రూపాయలు. వార, పక్ష, మాస పత్రికల ధరలు ఆకాశాన్ని అంటాయని వేరే చెప్పనక్కరలేదు.

దేశంలో జాతులు, కులగజ్జి, ఆశ్రిత పక్షపాతం, లంచాలు, కుంభకోణాలు- అన్నీ అలాగే వున్నాయి. ప్రస్తుతం మంత్రులందరికీ ఒక్కొక్కరికీ వందకు తక్కువ కాకుండ కుంభకోణాలు అన్నికోణాల నుంచీ ఉన్నాయి.

ఏ కమీషన్ దేనికో అడిగితే ఇంటర్వ్యూల్లో చెప్పలేక చస్తున్నారు.

ఇలా ఎన్నో విచిత్రాలు జరిగినట్టే- మరో నమ్మలేనినిజం- అనూహ్యమైన మార్పు- అదే, వరకట్నాల సిస్టమ్ అంతరించి అలనాటి గిరీశం కాలం నాటి 'కన్యాశల్కం' మళ్ళీ అమలులోనికి వచ్చింది!

* * * * *

సాయం సమయం. సూర్యాస్తమయ మౌతోంది. భానుడు తాపరహితుడై, ఎర్రగా కాలిన ఇనుపగుండులా అగుపిస్తున్నాడు. సముద్రతీరం వృద్ధుల మౌనరాగాలతో, జంటల గుసగుసలతో, పిల్లల కేరింతలతో – సందడిగా వుంది.

లవర్స్‌పార్కులో ప్రేమజంటలు అక్కడక్కడ పూపొదల చాటున మాటువేసి, ఎవరి సొదలో వాళ్ళున్నారు. ఒకమూల ప్రళయ, శ్రీసింహలు కూర్చుని వున్నారు.

శ్రీసింహ ముఖం ఖిన్నమై ఉంది. ప్రళయ అతనికేసి జాలిగా చూస్తోంది.

"ప్రళయా, ఈ జన్మకు మనకి పెళ్ళి జరుగు తుందా?"

"నాకు మాత్రం ఆశలేదా? కాని– మా నాన్న చండ శాసనుడు! ఐదు లక్షల కన్యాశుల్కం ఇవ్వకపోతే మన పెళ్ళికి ఒప్పుకోడు!" ప్రళయ స్వరంలో బాధ మిళితమయింది.

"ఓహ్! కన్యాశుల్కం, బ్లడీ– కన్యాశుల్కం! వెధవ డబ్బుకోసం మన ప్రేమను విడదీస్తాడా? ఇప్పటికే మీ అక్కయ్యలు నలుగురికీ పెళ్ళిళ్ళు చేసి బోలెడు సంపాదించాడు. ఇంకా ఆశ తీరలేదా?... ప్రళయా! నువ్వు లేకపోతే నా బ్రతుకు శూన్యం అయిపోతుంది. నువ్వు లేకుండా నేను బ్రతకలేను!ప్లీజ్! ఏదో ఒకటి నువ్వే చెయ్యాలి!..."

"నన్నర్థం చేసికో, సింహా! మా డాడీతో మాట్లాడడ మంటే నాకు గుండెదడ!..."

"ప్రేమించే వాళ్ళు భయపడరాదు! మధురమైన ప్రేమ మసి అయితే యింక బ్రతుకులో ఏం ఉంటుంది? ధైర్యంచేసి మీ నాన్నకు మన ప్రేమ గురించి చెప్పెయ్!"

"ఇప్పటికే ఇద్దరు ముగ్గురు ఐదు లక్షలు యిస్తామని వస్తున్నారు. ఇంకా ఎక్కువ వస్తుందేమోనని ఎదురు చూస్తున్నాడు మా డాడీ!... కావాలంటే ఇద్దరం కలిసి చద్దాంగాని, నావల్లకాదు!" ప్రళయ ఖచ్చితంగా చెప్పేసింది.

శతాబ్దం మారినా ప్రేమ మారదు! ఆగదు! అది అనంతమైనది. ఆ చైతన్య స్రవంతిలో ఎందరి ప్రేమ భగ్నమయిందో చరిత్రకు మాత్రమే తెలుసు! చరిత్ర కందని భగ్న ప్రేమలు ఎన్నో! జీవన పథంలో ప్రేమ విఫలమైనా అది అమరమైనది. మానవుని మనుగడలో తీయని అనుభూతి– ప్రేమ!!–


మరి, ప్రళయ, శ్రీసింహాల ప్రేమస్వప్నం అమృతధార లు చిలికేనా? లేక, భయంకర విషబిందువులను వెలిగ్రక్కేనా?–

* * * * * *

రోజు రోజుకీ ప్రళయకి సంబంధాలు వస్తున్నాయి.

ఒకరోజు శ్రీసింహ 'బూత్‌లో' ప్రళయ కోసం ఎదురు చూస్తున్నాడు. అంతలో ఆమె రానే వచ్చింది ఆమె మోములో విషాదాందోళనల ఉద్విగ్నత ప్రస్ఫుట మౌతోంది. శ్రీసింహ గుండె ఆ ముఖ కవళికలు చూసి ఒక క్షణం స్పందించడం మానేసింది! ఏదో కీడును శంకించింది!

"సింహా! అంతా అయిపోయింది! నిన్న అనకాపల్లి సిటీ నుండి ఒక మునలాడు వచ్చాడు. ఏడు లక్షలు శుల్కంగా ఇస్తానని! నాకు భయంగా



ఉంది!– ఈ సంబంధం బహుశా మా డాడి సెటిల్ చేసేస్తాడని నా మనసు కీడు శంకిస్తోంది!– ఇప్పుడు ఏం చేద్దాం?" ఉద్వేగంగా వెలిబుచ్చింది ప్రళయ.

శ్రీసింహకు ఏం బోధపడలేదు. ఇప్పుడు ఏం చేయడం?– బుర్ర ఎంత గోక్కున్నా ఆ సమస్య తీరే స్ఫూర్తి అతనిలో వెలగలేదు.

ఆరోజు నుండి శ్రీసింహ మనసు ఏమీ బాగోలేదు. ఎటు చూసినా అంధకారమే కనిపిస్తోంది. తమ ప్రేమ పండే చిహ్నాలు ఏమీ గోచరించలేదు. తిండి సహించడం లేదు. నిద్ర పట్టడం అస్సలు లేదు. గెడ్డం పెంచుకొని పిచ్చివాడిలా తయారయ్యాడు.

పాపం! ప్రళయకు కూడ బెంగ పట్టుకొంది. తను తన తండ్రిని ఎదిరించలేదు. అలా అని శ్రీసింహను కాదని మనలేదు.

ఆమె ఒక రోజంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది! అదే- శ్రీసింహతో కలిసి ఏ సముద్రంలోనో మునిగి ఆత్మహత్య చేసుకొనడమే! అలా ఆలోచిస్తుంటే ఆమె కను కొలకుల్లో నీరు చిప్పిల్లింది.

* * * * * *

అర్ధరాత్రి అమావాస్య, కారు చీకటి. ఆకాశంలో నక్షత్రాలు మాత్రం మిణుకు మిణుకు మంటున్నాయి.

ఎక్కడెక్కడో తిరిగి శ్రీసింహ యింటికి చేరాడు. అతని మనసేమీ బాగోలేదు. తినాలి అనిపించలేదు. తలుపు గుద్దకుండా- ఆరు బయట తనకోసం వేసి ఉంచిన మడత మంచంమీద వాలిపోయాడు.

మనసంతా శూన్యంగా ఉంది.

పాపం! ప్రళయ ఏం చేస్తోందో?- అనుకోకుండా దృష్టి ఎదురింటి మేడ వేపు సారించాడు...

భ్రుకుటి ముడిచి చూపును తీక్షణం చేశాడు.

అంత చీకటిలో కూడ ఆ దృశ్యం అతనికి అగుపించింది!

ఔను! నిజమే! తను చూస్తున్నది కల కాదు!-

ఒళ్ళంతా చెమట పోసింది. గుండె గుభేల్ మంది.

ఆ క్షణంలో అతని మనసులో లేని ధైర్యం వచ్చేసింది.

గభుక్కున లేచాడు. వడి వడిగా ఎదురింటి మేడకేసి శబ్దం చేయకుండా అడుగులు వేశాడు. కొన్ని క్షణాల్లో పోర్టికో వద్దకు చేరుకొన్నాడు.

ఎదురుగా డ్రెయినేజ్ పైపు మూడో అంతస్థు వరకు వ్యాపించి ఉంది. రెండవ అంతస్థులో ఆ పైపు వద్ద ఒక శాల్తీ గోచరించింది.

కొంపతీసి ప్రళయ ఆత్మహత్యా ప్రయత్నం చేయడం లేదుకదా!-

భయంకరమైన నిశ్శబ్దం. ఎక్కడో కీచురాళ్ళ రొద, శ్వాస బంధించి శ్రీసింహ ఆ శాల్తీ వేపు నోరు తెరచి చూస్తూ ఉండిపోయాడు.

శాల్తీ పైపు పట్టుకు దిగుతోంది!

శ్రీసింహ ఎలర్ట్ అయిపోయాడు.

శాల్తీ జాగ్రత్తగా దిగింది... నేలమీద అడుగు మోపేసరికి శ్రీసింహ అమాంతంగా ఉడుంపట్టు పట్టేశాడు. శాల్తీకి ఊపిరి పీల్చడం కష్టమయింది!

* * * * *

మరుసటి రోజు ఆ కాలనీ అంతా ఒకటే గోల!-

ఎవరినోట విన్నా అదే వార్త!

అదివిని కాలనీ అంతా నోళ్ళు వెళ్ళబెట్టారు!- కాలనీ సంగతి దేవుడెరుగు!- ప్రళయ తండ్రే నెత్తీ నోరూ కొట్టుకు ఏడుస్తున్నాడు.

పోలీసులకు మాత్రం రిపోర్టు చేయలేదు. జరిగింది చిన్న విషయం కాదు! పోలీసులకు రిపోర్టు చేసే విషయం కాదు!

తన కొంప మునిగినంత పనయింది!- ఏం చేయాలో పాలు పోలేదు- కొన్నాళ్ళు లబోదిబో మన్నాడు ప్రళయ తండ్రి. అతను మామూలు మనిషి కావడానికి కొన్ని రోజులు పట్టింది.

* * * * *

ఒకనాడు శ్రీసింహ డైరెక్ట్‌గా భీషణరావ్‌ని కలిశాడు.

అతను భ్రుకుటి ముడిచి ఏంటన్నట్లు చూశాడు.

శ్రీసింహ జరిగిందంతా చెప్పేశాడు!-

భీషణరావ్ అది విని నోరు తెరిచాడు!-

"బాబూ! నన్ను కాపాడావు!- నీవు చేసిన ఈ ఉపకారానికి నేనేం చేసినా ఋణం తీరదు" అని శ్రీసింహ చేతులు పట్టుకొన్నాడు. అటువంటి నిజాయితీపరుణ్ణి అతని జీవితంలో చూసి ఉండలేదు.

"నాకేం వద్దండి!... నేనూ, ప్రళయ ప్రేమించుకొన్నాం! మా ఇద్దరికీ పెళ్ళి జరిపించండి!" అని భీషణరావ్ కాళ్ళమీద పడ్డాడు శ్రీసింహ.

పక్కనేవున్న ప్రళయ కూడ "ఔను నాన్నా! నేను యితణ్ణే పెళ్ళి చేసుకొంటాను!" అని తనూ తండ్రి కాళ్ళమీద పడిపోయింది.

భీషణరావ్ యిద్దరినీ లేవదీశాడు. చిరునవ్వుతో యిద్దరినీ దీవించాడు.

త్వరలోనే ప్రళయ-శ్రీసింహల వివాహం బ్రహ్మాండంగా జరిగిందని వేరే చెప్పనవసరం లేదు!-

అయితే, ఒక సస్పెన్స్ చెప్పడం మరచా!- సారీ!

అదే, శ్రీసింహ ఆనాడు పట్టుకొన్న ఆ శాల్తీ ఎవరు?

కాలనీ అంతా నోళ్ళు తెరవడానికి కారణం?

భీషణరావ్ కానీ కన్యాశుల్కం లేకుండా వాళ్ళ పెళ్ళి జరిపించడానికి కారణం?

ఆరోజు శ్రీసింహ క్రిందికి దిగుతున్న శాల్తీని ఊపిరి ఆడకుండా పట్టుకొని- ప్రళయ కాదని యిట్టే నిర్ధారణ చేసికొన్నాడు. ఉత్తర క్షణంలో అతనికి ఆ శాల్తీ ఎవరో తెలిసిపోయింది! వెంటనే ఫడేల్‌మని మెడ నరంమీద ఒక కరాటే షాట్ యిచ్చాడు! ఎదురు చూడని ఆ దెబ్బకి ఆ శాల్తీ కంగారుపడి, చేతిలోని సంచిని కింద దబ్బున పడేసి పారిపోయాడు!

ఆ శాల్తీ ఒక పెద్ద గజదొంగ!

భీషణరావ్ తన నల్గురు కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేసి సంపాదించిన ఇరవై లక్షల రెడీ క్యాష్ ఆ సంచిలో వుంది!

కొద్ది రోజుల తర్వాత శ్రీసింహ భీషణరావ్ దగ్గరికి వచ్చి జరిగింది చెప్పి- ఆ ఇరవై లక్షలూ జాగ్రత్తగా తిరిగి అప్పచెప్పాడు!

పోయిన సొమ్ము తిరిగి దొరకడం అన్నది ఆ రోజుల్లో గొప్ప వండర్ మరి!- అంత సాహసం చేసి నిజాయితీగా డబ్బు వాపసు యిచ్చినందుకు ఉక్కిరిబిక్కిరై-

భీషణరావ్ వాళ్ళ పెళ్ళికి కన్యాశుల్కం లేకుండా 'ఎస్' అన్నాడు, మరి!

○



## నానా దర్శకత్వంలో డింపుల్

'ఫరిందా' చిత్రంలో అత్యద్భుతంగా నటించిన నానా పతేకర్ యిప్పుడు సుధాకర్ బొకాడేతో కలిసి 'ప్రహార్' చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. నాలుగు కోట్ల రూపాయల్తో నిర్మించబడుతున్న ఈ చిత్రానికి నానా పతేకర్ దర్శకుడు, నటుడు కూడా. ఈ కమర్షియల్ చిత్రంలో డింపుల్ కపాడియా హీరోయిన్‌గా నటిస్తోందట. ...క్కీంలో నిర్మించే ఈ చిత్రానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అం...స్తోంది.